RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 214 | జులై 22, 2025 | వెల : రూ.3-00

## కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో స్పాట్ అడ్మిషన్లు

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలోని గోవింద పూర్ గ్రామంలో కస్తూరిబా గాంధీ బాలికల కళాశాల, పాఠశాలలో మిగిలి పోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రత్యేక అధికారి మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ మీడియం ఆరో తరగతిలో ఎనిమిది సీట్లు, ఇంటర్మీ డియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియం ఎంపీసీ విభాగంలో నాలుగు సీట్లు, బైపీసీ విభాగంలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రత్యేక అధికారి మాధవి తెలిపారు. విద్యార్థినిలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



# చర్చకు నో చాన్స్

- కేంద్ర ప్రభుత్వ విధానం ఏకపక్షం
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఫైర్

**వేద న్యూస్, డెస్క్:**

పార్లమెంటు సమావేశాల్లో అధికారపక్ష సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్? లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్? గాంధీ ఆరోపించారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా అధికార పక్షంపై సోమవారం ఆయన ఫైర్ అయ్యారు. లోక్‌సభ సమావేశాల్లో తనకు మాట్లాడే అవకాశం కల్పించలేదని మండి పడ్డారు. కేంద్ర మంత్రులకు మాట్లాడే అవకాశం కల్పించారని, తనను మాత్రం మాట్లాడనివ్వలేదని పేర్కొన్నారు. సభ వాయిదా పడిన అనంతరం పార్లమెంటు? ఆవరణలో మీడియాతో మాట్లాడారు. సభలో రక్షణ మంత్రిని మాట్లాడేందుకు అనుమతించారని కానీ, ప్రతిపక్ష నాయకుడినైన తనను, ఇతర సభ్యులను మాట్లాడేందుకు అనుమతి ఇవ్వలేదని మండిపడ్డారు. ఇదో కొత్త తరహా విధానమని, ప్రభుత్వం తరపున ఉన్న వాళ్లను మాట్లాడేందుకు అనుమతిచ్చినపుడు తమకు కూడా అవకాశం ఇవ్వడం సంప్రదాయం అని పేర్కొన్నారు. అంతకు ముందు లోక్ సభలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్.. ఏ అంశమైనా చర్చించడా నికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యాఖ్యా నించారని తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించాల్సి న 8 కీలక అంశాల గురించి కాంగ్రెస్, ఇండియా కూటమిలోని ఇతర పార్టీలు గుర్తించాయని చెప్పారు. వీటిలో పహ ల్గాం, బిహార్ ఓటర్ల జాబితాలతో సహా ఇతర అంశాలను లేవనెత్తాయన్నారు. సమావేశం జరుగు తుండగా, తమ డిమాండ్లపై ప్రతిపక్ష పార్టీలు నినాదాలు చేయ దంతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు. మరోవైపు ఆపరేషన్ సిందూర్ పై చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలను ప్రియాంక గాంధీ ప్రస్తావించారు. చర్చల కు సిద్ధంగా ఉన్నప్పుడు ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు.





## చెరువును తలపిస్తున్న వీధి

**వేద న్యూస్, మేళ్లచెరువు :**

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలోని 13వ వార్డులో ఒక వీధి పూర్తిగా బురదమయం అయింది. వర్షం వస్తే వర్షం నీరుతో ఆ వీధి చెరువును తలపించే విధంగా తయారవుతుంది. ఈ కారణంగా అక్కడ స్థానికులు తీవ్ర ఇబ్బందులకు, రోగాలకు గురవుతున్నారు అని అక్కడ స్థానిక యువకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ముసలివారు బయటకు పోవాలంటే చాలా ఇబ్బంది పడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ డ్రైనేజీ కాలవ లేకపోవడంతో ఆ నీరు ఎటు పోవడానికి వీలుకాకుండా ఉండడంతో అవి రోడ్డు మీదనే ఉండిపోతున్నాయని పది రోజుల వరకు అలాగే ఉండటంతో మురుగు వాసన వచ్చి ఇళ్లలో నిలబడే పరిస్థితి లేదని అంటున్నారు. అసలే వర్షాకాలం కావడంతో దోమల బెడద మరీ పెరుగుతుందని స్థానికులు భయపడుతున్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా ,డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడవలసి వస్తుందని భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



## నానో ఎరువులపై అవగాహన

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలో నానో యూరియా,నానో డిఏపి వాడేలా రైతులను ప్రోత్సహిం చాలని మండల వ్యవసాయ అధికారి గంగాజమున ఆధ్వర్యంలో రైతులకు నానో ఎరువులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ నానో యూరియా, నానోడిఏపి వాడటం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల ఉత్పాదకత నాణ్యత పెరుగుతుంది ,పంటలకు పర్యావరణ ఒత్తిడి తెగుళ్లను తట్టుకునే శక్తిని అందిస్తాయని వ్యవసాయ అధికారి అన్నారు. అంతే కాకుండా పర్యావరణహితంగా పనిచేస్తాయని వారు పేర్కొన్నారు. నేలల ఆరోగ్యాన్ని మెరుగు పరచడమే కాకుండా గాలి నీటి కాలుష్యాన్ని తగ్గిస్తాయని, సంప్రదాయక ఎరువులకు బదులుగా నానో యూరియా ,నానో డిఏపి ఎరువులను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలు వాటి వినియోగం గురించి రైతులకు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో, ప్రగతిసింగారం గ్రామంలోని రైతులు, డీలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారం

**వేద న్యూస్, కమాన్‌చౌరస్తా :**

కరీంనగర్‌కు చెందిన తెలంగాణ కవి అన్నవరం దేవేందర్‌కు దాశరథి శతజయంతోత్సవాల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం దాశరథి కృష్ణమాచార్య సాహిత్య పురస్కారం వరించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో కేదారమ్మ-దశరథం దంపతులకు 1962 అక్టోబర్ 17న ఆయన జన్మించారు. ఎంఏ సామాజిక శాస్త్రం పూర్తి చేసిన ఆయన, జిల్లా పరిషత్‌లో సూపరింటెండెంట్‌గా 2020లో ఉద్యోగ విరమణ పొందారు. తెలంగాణ మాండలికంలో కవిత్వాలు రాస్తూ, నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా రచనలు చేస్తూ, తన కలం నుంచి ధికార స్వరాన్ని వినిపించిన గొప్ప వ్యక్తిగా గుర్తింపు పొందారు.ఇప్పటివరకు 16 పుస్తకాలు వెలువరించి ప్రశంసలు అందుకున్నారు. మొదటిసారి 2001లో 'తొవ్వ 'తో తన మొదటి కవిత సంపుటి వెలువరించారు. 2005లో మంకమ్మతోట లేబర్ అడ్డా పుస్తకం ఆవిష్కరించగా, ఆ పుస్తకాన్ని డిగ్రీ పాఠ్యాంశంగా చేర్చారు. ప్రస్తుతం ఆయన కరీంనగర్‌లో కాలమిస్టుగా పలు పత్రికల్లో వ్యాసాలు రాస్తున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం సాయంత్రం నిర్వహించే కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.శ్రీశ్రీ, శివసాగర్, సినారె, ఎన్ గోపి, నందిని సిదారెడ్డి సాహిత్య పుస్తకాలు చదివే క్రమంలో ఆయనకు 1988లో సాహిత్యంపై మకువ ఏర్పడింది. అన్నవరం ఇప్పటివరకు 16 పుస్తకాలు వెలువరించారు. ఇందులో 12 కవిత్వాలు, 2 ఆంగ్ల అనువాద కవిత్వం, 2 వ్యాసాల సంపుటిలు ఉన్నాయి. 2001లో 'తొవ్వ 'తో తన మొదటి కవిత సంపుటి వెలువరించారు. ఆ తరువాత 2003లో 'నడక' తన ద్వితీయ పుస్తకాలు అచ్చువేశారు. 2005లో మంకమ్మతోట లేబర్ అడ్డా పుస్తకం ఆవిషరించారు. ఆ పుస్తకాన్ని డిగ్రీ పాఠ్యాంశంగా చేర్చారు. 'బుడ్డ పరలు' నానీలు 2006లో, బొడ్డు మల్లె చెట్టు 2008లో, పొద్దుపొడుపు కవిత సంకలాన్ని 2011లో ఆవిషరించారు.2014లో పొకిలి వాకిళ్లు పులకరింత, 2016లో 'బువ్వ కుండ' దీర్ఘ కవిత సంపుటి, 2016లో ఇంటి దీపం, 2018లో వరిగొలుసులు, 2021లో గవాయి, 2022లో జీవన తాత్పర్యం పుస్తకాలను ఆవిషరించారు. 2002లో 'మరో కోణం' వ్యాస సంపుటిని, 'ఊరి దస్తూరి' వ్యాస సంపుటి, 2023లో సంచార యాత్ర వ్యాసాల సంకలనం, 2024లో అంతరంగం (వర్తమాన జీవిత చిత్రణ)ను అన్నవరం దేవేందర్ సంపాదకులుగా వ్యవహరించారు.

# రైల్వే ఫ్లైఓవర్ నిర్మించాలి



**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి**

మిర్యాలగూడ పట్టణంలో రోజురోజుకీ ట్రాఫిక్ రద్దీ గణనీయంగా పెరుగుతుంది. జనాభాకు తగ్గట్టుగా జనావాసాలు కూడా పెరుగుతూ ఉన్నాయి నియోజకవర్గం చుట్టుపక్కల ప్రజలు ప్రతిరోజు ఏదో ఒక అవసరం కోసం పట్టణ కేంద్రంలోకి వస్తూ పోతుంటారు. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ సమీపం, సాగర్ రోడ్డులో ఎఫ్సిఐ రైల్వే ట్రాక్ వద్ద కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై ప్రతినిత్యం రైళ్ల రాకపోకల వల్ల రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ రైల్వే ట్రాక్ పై ఫ్లైఓవర్ నిర్మించి రాకపోకల అంతరాయాన్ని నివారించాలని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్ కోరుతున్నారు.

సోమవారం ఆయన రైల్వే ట్రాక్ వద్ద జరిగిన అంతరాయం విష యమై మాట్లాడుతూ ఉదయం 10-30గం టలకు మరియు 12 గంటల సమయంలో రెండు సార్లు ట్రాక్ మీదుగా గూడ్స్ వ్యాగన్ వెళ్ళగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు.రెండు సందర్భాల్లోనూ మూడు అత్యవసర అంబులెన్సులు ట్రాక్ వద్ద ట్రాఫిక్ లో చిక్కుకొని రోగులు ఇబ్బందులకు గురి అయ్యారని చెప్పారు.నిత్యం రద్దీగా వుండే 167 జాతీయ రహదారిపై తక్షణం ఫ్లైఓవర్ నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ట్రాక్ పై రైలు రోడ్డు దాటి సందర్భంలో అర గంట వరకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఇప్పటికెనా రైల్వే అధికారులు,జాతీయ రహదారి నిర్వహణ అధికారులు సమన్వయం చేసు కొని ఎఫ్సిఐ నుండి శ్రీనివాస్ నగర్ వరకు భారీ ఫ్లైఓవర్ నిర్మించి ట్రాఫిక్ అంతరాయం,అంబులెన్స్ లో వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు

**వేద న్యూస్, కరీంనగర్ :**

నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో నార్కోటిక్ సెల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.నార్కోటిక్ జాగిలం రాంబోతో జిల్లా కేంద్రంలో తనిఖీలను ముమ్మరం చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఇందులో భాగంగా, కమిషనరేట్ పరిధిలో నిషేధిత గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడానికి జమ్మికుంట పట్టణ ఠాణా పోలీసులు సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. జమ్మికుంట ఇన్స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్, బస్టాండ్, పార్సిల్ కార్యాలయాలు, కిరాణా షాపులు, పాన్ షాపులు వంటి ప్రాంతాల్లో ఈ తనిఖీలు జరిగాయి. నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలం, డాగ్ హ్యాండ్లర్ కానిస్టేబుల్ కపిల్ కూడా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ప్రజలు బాధ్యతా యుతంగా వ్యవహరించి, ఎవరైనా వ్యక్తుల వద్ద ప్రభుత్వం నిషేధించిన గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు ఉన్నా, వాటిని విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే డయల్ 100కు డయల్ చేయాలని లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని కమిషనర్ గౌస్ ఆలం విజ్ఞప్తి చేశారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.





# "చలో గన్‌పార్క్" సక్సెస్ చేయండి

**- టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి**

**వేద న్యూస్, జమ్మికుంట:**

మంగళవారం హైదరాబాద్‌లో జరిగే "చలో గన్‌పార్క్" కార్యక్రమానికీ తెలంగాణ ఉద్యమకారులు తమ విధిగా భావించి.. హాజరు అయి వారి హక్కుల కోసం, ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం, హాజరు కాగలరని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం జమ్మికుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు హుజురాబాద్ నియోజకవర్గ, జమ్మికుంట, ఇల్లంతకుంట మండల కమిటీని ప్రకటించారు. నియామకపు ఉత్తర్వులు అందజేశారు. హుజురాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా నకీర్త రాజు ను, జమ్మికుంట మండల ఉపాధ్యక్షునిగా పేరవేని రమేష్ , ఇల్లంతకుంట మండల సహాయ కార్యదర్శిగా గుడికందుల రాజయ్యను నియమిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో రమేష్ రెడ్డి హుజురాబాద్ నియోజకవర్గ కార్యదర్శి పాకాల మల్లారెడ్డి, గురుకుంట్ల రాజీరు, ముత్యాల రమేష్, పెరవేన కుమార్ యాదవ్, మిల్కూరి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు కీలకం



**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**వేద న్యూస్, వీర్నపల్లి :**

ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం అమలులో రేషన్ కార్డులు అత్యంత కీలకమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.వీర్నపల్లి రైతు వేదికలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను కలెక్టర్, ప్రజాప్రతినిధులు సోమవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వీర్నపల్లి మండలంలోని అర్హులైన 329 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని వెల్లడించారు. అలాగే ఇప్పటికే ఉన్న కార్డుల్లో మొత్తం 975 మందిని అదనంగా చేర్చామని వెల్లడించారు. రేషన్ కార్డు చాలా కీలకమైన డాక్యుమెంట్ అని, ఆధార్ కార్డు, కరెంట్ కనెక్షన్ , ప్రభుత్వ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. నూతన రేషన్ కార్డు ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్ వంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంకా కార్డు రాని వారు ఉంటే సమీపంలోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అనితెలిపారు.ఈ కార్యక్రమంలో కే కే మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, డీఎం సివిల్ సప్లై రజిత, లబ్ధిదారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా వాగ్బట యోగా అండ్ వాకార్స్

# కుటుంబ ఆత్మీయ సమ్మేళనం



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ఆరోగ్యమే మహా భాగ్యం అంటూ, ప్రతి వ్యక్తి జీవితంలో యోగ భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో వాగ్బట యోగా అండ్ వాకర్స్ అసోసియేషన్ పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు పెసర నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం బొల్లికుంట క్రాస్ రోడ్డులోని ఓ రీసార్టులో వాగ్బాట యోగా సంఘం సభ్యులు కుటుంబ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. సుమారు 24 జంటలు పాల్గొన్న ఈ కుటుంబ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో చిన్నా పెద్ద అందరూ కలిసి ఆటా పాటలతో రోజంతా సందడి చేశారు. ఎన్నో రకాల ఒత్తిడుల నడుమ సాగె బిజీ బిజీ, గజి బిజీ లైఫ్ లో ఇలాంటి కార్యక్రమాలు మనసుకి ఆహ్లాదాన్ని కలిగిస్తాయని, తద్వారా మానసిక ఒత్తిడికి లోనవకుండా వుంటారని అన్నారు. అదే విధంగా ప్రస్తుత జీవిత ప్రయాణంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి కోరారు. అనంతరం అటవిడుపు కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో మధు, రామచందర్, మోహన్, వేణు, కర్ణాకర్, నవీన్ రెడ్డి, కన్నయ్య,రాంబాబు, సుభాష్, గోపాల్ , శ్రీశైలం, ఖాన్ సాబ్, చిన్నా, ప్రతాప్ రెడ్డి, సత్యనారాయణ, పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.



## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న

# ఎమ్మెల్యే నాయిని

**వేద న్యూస్, హన్మకొండ :**

వికారినామ సంవత్సర శ్రావణ మాసం పుర్ణిమా సందర్భాన్ని, తన జన్మదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా హనుమకొండలోని శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక బృందం వేద మంత్రోచ్చారణలతో ఎమ్మెల్యేకి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వరంగల్ చారిత్రక స్థలమైన వేయి స్థంభాల దేవాలయంలో శ్రీ రుద్రేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో వారి సతీమణి నాయిని నీలిమ రెడ్డి, కుమార్తె, అల్లుడు డాక్టర్ గోదా విష్ణు రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, పలువురు పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ భవన నిర్మాణ పనులను

# పరిశీలించిన కలెక్టర్



**వేద న్యూస్, ముస్తాబాద్ :**

ముస్తాబాద్ మండలకేంద్రంలో తహసిల్దార్ కార్యాలయ భవనం పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం పరిశీలించారు. ముస్తాబాద్ మండలకేంద్రంలో కొనసాగుతున్న తహసిల్దార్ కార్యాలయ భవనం పనులను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.కుట్టు మిషన్ల పంపిణీ ముస్తాబాద్ మండల కేంద్రంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పలువురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం ఆద్వర్యంలో ముస్తాబాద్ లోని రైతు వేదికలో దాదాపు 28 కుట్టు మిషన్లు మహిళలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు కుట్టు మిషన్లు మహిళలకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. మహిళలు కుట్టు మిషన్లు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కే కే మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఏఎంసీ చైర్ పర్సన్ తలారి రాణి, తహసిల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు గ్రీవేన్స్ డే

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి:**

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై మిర్యాలగూడ నియోజకవర్గంలో గ్రీవెన్స్ డే నిర్వహించడం జరుగుతుంది. మిర్యాలగూడ,సాగర్ నియోజకవర్గం పరిదిలో విద్యుత్ సమస్యల విషయంలో మిర్యాలగూడ డివిజన్ ఆవరణలో ఈనెల 25వ తారీకు శుక్రవారం ఉదయం 10 గంటల నుండి రెండు గంటల వరకు సిజిఆర్ఎఫ్ (కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రా సెల్ ఫోరం) రామాంజ నాయక్ సిజిఎం మరియు మెంబర్ ఫైనాన్స్,వెంకట్ ఎన్ కే కే ఇండిపెండెంట్ నెంబర్ కన్స్యూమర్ గ్రీవెన్స్ రేడ్రా సెల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ డివిజనల్ ఇంజనీర్ ఎం.శ్రీనివాసాచారి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి రైతులు,వాణిజ్య, గృహ మరియు ఇతర విద్యుత్తు వినియోగదారులు హాజరయ్యేవారు ఆధార్ కార్డ్, కరెంటు బిల్లుల రసీదులు తీసుకొని రావాలని పేర్కొన్నారు.

# విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి



**వేద న్యూస్, ఇల్లంతకుంట :**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు ,జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ,ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న తేదీన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు,జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు బండారి చందు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూవిద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలని. మెస్ కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని అన్నారు. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న బోజన పథకాన్ని అమలు చేయాలన్నారు.బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చెయ్యాలని ప్రైవేట్,కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని అన్నారు.విద్యార్థులకు ఆర్టీసీ లో ఉచిత బస్ పాస్‌లు ఇవ్వాలని.నూతన జాతీయ విద్య విధానం( ఎన్ఈపి 2020) తెలంగాణలో అమలు చెయ్యకుండా అసెంబ్లీలో తీర్మానం చెయ్యాలనిపైన పేర్కొన్న డిమాండ్స్ పై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి విద్యారంగ సమస్యను పరిష్కరించాలని 23న తలపెట్టిన విద్యాసంస్థల బంద్ ను మండలంలో విజయవంతం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు సావనపెల్లి విష్ణు, జుట్టు సురేందర్, ఏనుగుల అరవింద్, రాజు, అనిల్, అఖిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మామిడిపల్లి- నిజామాబాద్ రాకపోకలకు అంతరాయం

**వేద న్యూస్, కోనరావుపేట :**

కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి-నిజామాబాద్ మార్గంలో ఉన్న మూలవాగు వద్ద రోడ్ వర్షాల కారణంగా తెగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పూర్తిగా తెగిపోవడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.ఈ సమాచారాన్ని తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై కే. ప్రశాంత్ రెడ్డి వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన ఎస్సై, ప్రజల ప్రాణాలకు ముప్పు తలెత్తకుండా ఉండేందుకు తక్షణమే చర్యలు చేపట్టారు. వాగు ప్రవాహంతో తెగిపోయిన ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేయించి, వాహనదారులకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ప్రజా ప్రభుత్వం గడిచిన 18 నెలల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంగా 18 నెలలు,18 పథకాలు,18 రోజులు అనే కార్యక్రమంతో వేములపల్లి మండలం,మిర్యాలగూడ మండలాల్లోని పలు గ్రామాలకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని సంక్షేమాలు కేవలం ధనవంతులు ఇంకా ధనవంతులు కావడానికే తప్ప పేదలకు చేసింది ఏది లేదు అని ఎద్దేవా చేశారు. కమిషన్ల కోసం ప్రజా ధనాన్ని వృథా చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కేవలం 18 నెలల్లోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతూనే మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకై మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందించడంతో పాటు పదేళ్ళుగా వాళ్ళు ఇవ్వలేని రేషన్ కార్డులు అందించిందన్నారు.ప్రతి పేదవాడికి సన్నబియ్యం పంపిణీ చేసింది. ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూర్ చేసింది రైతు రుణమాఫీ చేసింది.బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఆమోదించింది.ఇలా అతి తక్కువ కాలంలోనే పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించి పేదల ప్రభుత్వంగా ప్రజాధారణ పొందింది అని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మనం వెనకబడిపోయాము అని అన్నారు. ప్రతిపక్ష నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పి కొట్టలేకపోతున్నారు అని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమాలను ఈ కరపత్రం ద్వారా గడప గడపకు చేరవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు,గ్రామ శాఖ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# దశాబ్ది తర్వాత రేషన్ కార్డుల పంపిణీ

**వేద న్యూస్, బోనకల్/ చింతకాని :**

పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వారు ప్రజలకు రేషన్ కార్డుల పంపిణీని పట్టించుకోలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కానీ, రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం కొలువురిన తర్వాత అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నదని చెప్పారు. సోమవారం ఆయన ఖమ్మం జిల్లా బోనకల్, చింతకాని మండలాల్లో పర్యటించారు. బోనకల్ మండల కేంద్రంలో జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ కార్డుల పంపిణీ నిరంతరం సాగిందని, తిరిగి తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన కొద్దికాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 93 లక్షల కుటుంబాలకు ఆహార భద్రత కార్డులను పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం కింద 51 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. పేద పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రవేశ పెడుతున్నట్లు చెప్పారు. చింతకాని మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద దళిత బంధు రెండోవిడతలో రూ.4.63 కోట్లతో 214 మంది లబ్ధిదారులకు మంజూరైన యూనిట్లను మల్లు భట్టి విక్రమార్క పంపిణీ చేశారు. మిగతా లబ్ధిదారులకూ త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. దళిత బంధు యూనిట్ల క్రయ విక్రయాలు నేరమని, వాటితో కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని హితవు చెప్పారు. అంతకు ముందు మండలంలోని గాంధీనగర్‌లో ఒక లబ్ధిదారుడి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భట్టి విక్రమార్క భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు త్వరిగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. జోరువానలోనూ ఆయన చింతకాని, గాంధీనగర్‌ల్లో పర్యటించడం విశేషం.



## కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో చెరువులు కుంటలు నింపాలి

**వేద న్యూస్, ముస్తాబాద్ :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో ఆవునూర్, తుర్కపల్లి మరియు రామలక్షణపల్లె గ్రామాల బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలలో చెరువులను కుంటలను కాళేశ్వ రం ప్రాజెక్టు నీటితో నింపాలని ఆవునూర్ చెరువు వద్ద ఆందోళన చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం నీళ్లు ఇచ్చిందని, ఎండాకాలంలో కూ డా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని చెరువులు కుంటలు నీళ్లతో జలకళలాడాయని గుర్తు చేశారు.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత ఆలోచనతో నీటిని నింపడం లేదని ఆరోపించారు. నీళ్లు లేక,వర్షాలు లేక రైతులు అల్లాడుతున్నారని, ఇప్పటికైనా చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్ర మంలో ఆవునూర్, తుర్కపల్లి, రామలక్ష్మణ పల్లె బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కలలు వ్యక్తి ప్రతిభకు నిదర్శనం



**వేద న్యూస్, చొప్పదండి రామడుగు :**

మన సంస్కృతీ సంప్రదాయాలకు ఆలవాలమైన కలలు వ్యక్తి లో జిజ్ఞాస స్థిరత్వాన్ని పెంచుతాయని ఆల్ఫోర్స్ సంస్థల అధినేత నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెదిర శివారులోని ఓ ప్రైవేట్ హాల్లో నయా పేరుతో ఏర్పాటు చేసిన స్వాగత ఉపన్యాస కార్యక్రమంలో నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలలు వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తరగతి గదుల్లో వివ రించాలన్నారు. విద్యార్థుల్లో దాగిన కళా నైపుణ్యాన్ని ఆల్ఫోర్స్ సంస్థ ఎప్పుడు ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం ఇంటర్ లో వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన విద్యార్థి జీవితం విలువైనదిరా... అనే విషయం తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులచే చప్పట్లు కొట్టించాయి.

## ఏటీసీలు ఆధునిక శిక్షణ సంస్థలు



**-'టీజీ రైజింగ్-2047 విజన్'కు అనుగుణంగా..**

**-నిర్దేశిత సమయానికి సెంటర్ల పనులు పూర్తి చేయాలి**

**- ఏటీసీల పురోగతిపై రివ్యూ మీటింగ్‌లో సీఎం రేవంత్**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

తెలంగాణ రైజింగ్-2047 విజన్‌కు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) రూపుదిద్దుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్దేశిత సమయానికి అనుగుణంగా వీలైనంత త్వరగా ఏటీసీల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఏటీసీల అభివృద్ధి, పనుల్లో పురోగతిపై డా.బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా "ఏటీసీలు తెలంగాణ యువతకు అత్యాధునిక శిక్షణా సంస్థలు" అన్న పేరుతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మారుతున్న పరిస్థితులు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ఐటీఐలను ఏటీసీ లుగా మార్చడంలో జరుగుతున్న అభివృద్ధి, పనుల్లో పురోగతిపై ముఖ్యమంత్రి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు దశల్లో 111 ఏటీసీ లను అభివృద్ధి చేపట్టినట్టు అధికారులు వివరించారు. అందులో మొదటి దశలో 25, రెండో దశలో 40, మూడో దశలో 46 ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. మొదటి రెండు దశలకు సంబంధించి ఇప్పటికే 49 ఏటీసీలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఏటీసీలను వీలైనంత తొందరగా పూర్తి చేసేందుకు అవసరమైతే నైపుణ్యం కలిగిన నిర్మాణ సంస్థల సహకారం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. జరుగుతున్న పనులను పరిశీలించ డానికి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని చెప్పారు. అలాగే, జినోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఫార్మా, బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమల అవసరాలకు తగినట్టుగా శిక్షణ అందించే కోర్సులను అక్కడ నిర్వహించాలని అన్నారు. అందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించడంతో పాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను తయారు చేయాలన్నారు.

# అట్టహాసంగా 'వేద' ఆస్పత్రి ప్రారంభం

**- ఐఎంఏ హుజూరాబాద్-జమ్మికుంట అధ్యక్ష కార్యదర్శుల చేతుల మీదుగా..**

**- ప్రజలకు మెరుగైన కంటి, చెవి, ముక్కు గొంతు, వైద్య సేవలే లక్ష్యం**

**- డాక్టర్ వెంకటసాయి నేత్ర నిఖిత దంపతులు**





**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని వీణవంక రోడ్డు ఎస్బీఐ బ్యాంకు పక్కన 'వేద' కంటి, చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రిని సోమవారం ఐఎంఏ హుజూరాబాద్-జమ్మికుంట శాఖ అధ్యక్షుడు డాక్టర్ అంకం సుధాకర్, కార్యదర్శి డాక్టర్ ఊడుగుల సురేశ్ ప్రారంభించారు. 24 గంటల వైద్య సౌకర్యం హాస్పిటల్‌లో అందుబాటులో ఉంటుందని, గ్రామీణ, జమ్మికుంట పట్టణ, మండల, పరిసర ప్రాంత వాసులందరికీ మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యమని సదరు ఆస్పత్రి డాక్టర్లు, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ టి.వెంకట్ సాయి నేత్ర ఎంబీబీఎస్ ఎంఎస్(ఆప్తమాలజీ), చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.నిఖిత దంపతులు వెల్లడించారు. జమ్మికుంట పరిసర ప్రాంత ప్రజలకు నిపుణులైన ఎంఎస్(ఆప్తమాలజీ), ఎంఎస్(ఈఎన్‌టీ) వైద్యులచే చెవి, ముక్కు, గొంతు కంటికి సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు, ఆపరేషన్లు సదరు ఆస్పత్రిలో అందుబాటులోకి రానున్నాయి. ఈఎన్‌టీ, కంటి సంబంధిత పరీక్షలు, వైద్యం కోసం సుదూర ప్రాంతాలు వెళ్లకుండా జమ్మికుంట పట్టణంలోని 'వేద' ఆస్పత్రిని సంప్రదించొచ్చని ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు పేర్కొన్నారు. అత్యాధునిక పరికరాలతో టెస్టులు 'వేద' ఆస్పత్రిలో ఆధునిక వైద్య పరికరాలతో టెస్టులు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గత కొన్నేండ్లుగా జమ్మికుంట ప్రాంతవాసులకు మెరుగైన కంటి వైద్య సేవలు అందిస్తున్న నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ తిరునహరి సురేశ్ బాబు తనయుడు వెంకటసాయి నేత్ర ఎంబీబీఎస్ ఎంఎస్(ఆప్తమాలజీ) చదివి.. సొంతూరులో తండ్రి అడుగు జాడలో తన వంతుగా సేవామార్గంలో ఆస్పత్రి ప్రారంభిం చడం పట్ల పలువురు పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేశా రు. 'వేద' ఆస్పత్రిలో వెంకటసాయి నేత్ర జీవిత భాగస్వామి డాక్టర్ నిఖిత ఎంబీబీఎస్ ఎంఎస్(ఈఎన్‌టీ) చెవి, ముక్కు, గొంతు వైద్య సేవలను అందించనున్నారు. కాగా, నాన్న అడుగుజాడలో సేవామార్గంలో చక్కటి సేవలందించి వెంకటసాయి ప్రజల్లో చక్కటి పేరు గడించాలని, ప్రజావైద్యుడిగా రాణించాలని, ప్రజా ఆస్పత్రిగా 'వేద' ఆస్పత్రి వర్ధిల్లాలని పలువురు శ్రేయోభిలాషులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ డాక్టర్ తిరునహరి సురేశ్ బాబు, సీనియర్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేవాసారథి 'ఊడుగుల'



**- ఉత్తమ వైద్యుడిగా గోల్డ్ మెడల్స్ అందుకున్న ప్రముఖ వైద్యుడు**

**- ఐఎంఏ హుజూరాబాద్ జమ్మికుంట శాఖ ప్రధాన కార్యదర్శిగానూ సురేశ్ సేవలు**

**- విలువైన వైద్యాన్ని గ్రామీణ ప్రజలకు తక్కువ ఖర్చులో అందించేందుకు ప్రయత్నం**

**- సామాజిక బాధ్యతగా పలు ఆరోగ్య సంబంధిత విషయాలపై నిత్యం అవగాహన**

**వేద న్యూస్, జమ్మికుంట:**

ప్రజలకు సేవ చేయాలనే ఆశయం, ఆలోచనకు బీజం చిన్న నాటనే ఆయన మనసులో పడింది. తన సొంతూరు నుంచి సుదూర ప్రాంతాలకు సరైన వైద్యం కోసం తండ్రి, గ్రామస్తులు వెళ్తుండటం గమనించిన ఆయన.. వైద్యుడిని అయి సొంతూరులో ఆస్పత్రి స్థాపించాలని కల కన్నారు. ఆ కల సాకారం చేసుకునేందుకు ఇష్టపడి, కష్టపడి వైద్య విద్య చదివి.. హాస్పిటల్ ఎస్టాబ్లిష్ చేశారు. వృత్తిలో నైపుణ్యాన్ని, ఎన్నో గోల్డ్ మెడల్స్‌ను సైతం సంపాదించి.. ప్రముఖ వైద్యుడిగా పేరొంది.. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చులో విలువైన ట్రీట్‌మెంట్ అందించేందుకు ఆయన కృషి చేస్తున్నారు. ఇంతకీ ఆయనెవరంటే.. ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) హుజూరాబాద్ జమ్మికుంట శాఖ ప్రధాన కార్యదర్శి, మోత్కులగూడెం వాసి, సహస్ర స్టార్ హాస్పిటల్, సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు, ఎంబీబీఎస్, ఎండీ జనరల్ ఫిజీషియన్, డీఏ కన్సల్టెంట్ ఫిజీషియన్, ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, పెయిన్ స్పెషలిస్ట్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ ఊడుగుల సురేశ్..

**చంద్రబాబు చేతుల మీదుగా అత్యున్నత ప్రతిభ అవార్డు..**

మోత్కులగుడెంలో ఊడుగుల లక్ష్మీ-మల్లయ్య దంపతులకు 1985లో జన్మించిన సురేశ్ చిన్న నాటి నుంచి చదువులో ముందున్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు జమ్మికుంట జవహర్ పబ్లిక్ స్కూల్‌లో చదివిన సురేశ్..8 నుంచి 10 వ తరగతి వరకు విద్యోదయ హైస్కూల్ విద్యను అభ్యసించారు. ఆ సమయంలో టెన్త్ క్లాస్ రిజల్ట్స్‌లో టాపర్‌గా నిలిచారు. రాష్ట్ర స్థాయిలో 561 మార్కులు/600 సాధించారు. అందుకు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అత్యున్నత ప్రతిభ అవార్డు అందుకున్నారు. బాల వికాస సమితి ఆధ్వర్యంలోనూ పురస్కారం అందుకున్నారు. హన్మకొండ ఎస్వీసీ కాలేజీలో ఇంటర్మీడియెట్‌లో బైపీసీ ఎంచుకున్న సురేశ్.. అక్కడ కూడా చదువులో రాణించారు. ఇంటర్‌లోనూ రాష్ట్ర స్థాయిలో మార్కులు సాధించారు. 956/1000 మార్కులు సాధించి.. శభాష్ అనిపించుకున్నారు.

**మెడికల్ విద్యలో వరించిన స్వర్ణ పతకాలు ..**

అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో గవర్నమెంట్ మెడికల్ కాలేజీ అనంతపూర్‌లో ఎంబీబీఎస్ విద్యను ఊడుగుల సురేశ్ అభ్యసించారు. చదువుతున్న క్రమంలో ఎన్నో గోల్డ్ మెడల్స్ సాధించి బెస్ట్ ఔట్ గోయింగ్ డాక్టర్‌గా ఎంసీఐ మెంబర్చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. అనంతరం డిప్లొమా ఇన్ అనేస్తేసియా చేశారు. కేఎంసీ వరంగల్‌లో రాష్ట్ర వ్యాప్త క్విజ్ పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచాడు. అనంతరం ఎండీ(జనరల్ మెడిసిన్) శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీ తిరుపతిలో అభ్యసించారు. ఆ సమయంలోనూ అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ డాక్టర్ అవార్డు అందుకున్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే మనస్తత్వం కలిగిన సురేశ్ నిరాడంబరంగా ఉంటూ.. పేద ప్రజలకు వైద్యం అందిస్తూ.. సేవామార్గంలో ముందుకెళ్తున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) జమ్మికుంట, హుజురాబాద్ శాఖ ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. సదరు అసోసియేషన్ కార్యదర్శిగా వైద్యుల సమస్యల పరిష్కారం కోసం, వైద్యుల ఐక్యత కోసం పాటు పడుతున్నారు. సామాజిక బాధ్యతపై పలు విషయాలపై అవేర్‌నెస్ పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న వైద్యులు తమ వృత్తి జీవితంలో ఎంతో బిజీగా ఉంటారు. తమ విధులు నిర్వర్తించే సమయంలోనూ దాదాపుగా తలమునకలై అలసిపోతుంటారు. కాగా, ఆ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూనే.. సామాజిక బాధ్యతగా పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ముందు వరుసలో నిలుస్తున్నారు డాక్టర్ ఊడుగుల సురేశ్. నిత్యం సోషల్ మీడియా వేదికగా ప్రజారోగ్యం కోసం జ్వరం, షుగర్, బీపీ, గుండె పోటు, పాము కాటు, తేలు కాటు మొదలైన ఆరోగ్య సూత్రాలు, సైంటిఫిక్ విషయాలను గురించి అవగాహన కల్పిస్తుండటం విశేషం. ప్రజలకు నిత్యం ఆస్పత్రిలో అందుబాటులో ఉంటూనే.. ఫోన్ కాల్‌కు సైతం రెస్పాండ్ అయ్యేలా ఆయన సేవలు కొనసాగుతుండటం ముదావహమే. 'ద జెర్డ్ గైడ్'తో పాటు షుగర్ ఇతర విషయాలపై డాక్టర్ ఊడుగుల సురేశ్ పుస్తకాలను సైతం రచించి అందుబాటులోకి తీసుకురావడం ప్రత్యేకం. ఆస్పత్రిలో రోగులకు అందరికీ అందుబాటులో వెంటిలేటర్, డయాలసిస్ సేవలు అందిస్తున్నారు.


**మెరుగైన వైద్య సేవలే లక్ష్యం**

బాల్యం నుంచి నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్న డాక్టర్ ఊడుగుల సురేశ్.. చదువులో ముందుంటూనే.. విద్యార్థి దశలో జూనియర్ డాక్టర్స్ సంఘానికి అధ్యక్షుడిగా పని చేశాను. వైద్యుడిగా ప్రాక్టీసు మొదలుపెట్టిన తాను ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు అత్యంత విలువైన, ముఖ్యమైన ఐసీయూ, వెంటిలేటర్, డయాలసిస్, ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ సర్వీసులను తక్కువ ఖర్చుతో అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు వెల్లడించారు. ఓ పేషెంట్(పేరు గోప్యం) పురుగుల మందు తాగిన క్రమంలో పేషెంట్‌కు వెంటిలేటర్ మీద చికిత్స చేయగా, సదరు పేషెంట్ రికవర్ అయి ధన్యవాదాలు తెలిపిన సందర్భంగా తనకు జీవితంలో డాక్టర్‌గా సంతృప్తిని ఇచ్చిందని సురేశ్ పేర్కొన్నారు. మోత్కులగూడెం గ్రామం, పరిసర ప్రాంత ప్రజలు సరైన వైద్యం కోసం హన్మకొండ, వరంగల్‌కు గతంలో వెళ్తుండేవారని, వారికి సరైన వైద్యం ఇక్కడే ఇవ్వాలనే ఉద్దేశంతోనే తాను జమ్మికుంటలోనే ఆస్పత్రి స్థాపించాలని చిన్ననాటే భావించానని పేర్కొన్నారు.

## టీబీజీకేఎస్‌తోనే కార్మిక హక్కుల సాధన

**వేద న్యూస్, గోదావరిఖని :**

సింగరేణి కార్మిక హక్కుల సాధన టీబీజీకేఎస్‌తోనే సాధ్యమని మాజీ మంత్రి, టీబీజీకేఎస్ ఇన్‌చార్జి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. టీబీజీకేఎస్ ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా సోమవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌ను వేధింపులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. టీబీజీకేఎస్ నాయకులపై వేధింపులు ఆపాలని డిమాండ్‌చేశారు.ఈ నెల 23న కోల్‌బెల్ట్ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీల ఆధ్వర్యంలో సింగరేణి సీఎండీని కలిసి బదిలీని నిలిపివేయాలని కోరనున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి టీబీజీకేఎస్, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. టీబీజీకేఎస్ ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించిన కేసీఆర్, కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



# కల్తీ పేరిట కల్లు నిషేధానికి కుట్రలు ..?




**-గీతన్నల వృత్తి గౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకునే ప్రసక్తే లేదు**
**-లిక్కర్ మాఫియాకు ప్రభుత్వంతలొగ్గి తప్పుడు నిర్ణయాలు**
**-కల్లు మండువాల నుంచి 35 మంది ఎమ్మెల్యేలకు ముడుపులు**
**-బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చిట్టావిప్పేందుకు సిద్ధం**
**-కాంగ్రెస్ సర్కార్‌కు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక**

**హైదరాబాద్, వేద న్యూస్ :**

కల్తీ పేరిట ఔషధ గుణాలు కలిగిన కల్లును నిషేధించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. లిక్కర్ మాఫియాకు తలొగ్గి గీత వృత్తిపై కక్ష కడుతున్నదని ధ్వజమెత్తారు. గీత సొసైటీలకు ఐదు ఎకరాల స్థలం ఇస్తామని, ప్రమాద ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచుతామని, మద్యం దుకాణాల కేటాయింపులో 25 శాతం కోటా వర్తింపజేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఏడాదిన్నర దాటినా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గట్టు రాంచందర్‌రావు, కిశోర్‌గౌడ్, నాగేందర్‌గౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.పలు కల్లు కాంపౌండ్లలో జరిగిన కల్తీ ఘటనలను సాకుగా చూపిస్తూ ప్రభుత్వం లక్షల మంది ఆధారపడ్డ కులవృత్తిని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. కల్లు కాంపౌండ్ల మీద పది కులాలు బతుకున్నాయనే స్పృహ లేకుండా వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. లిక్కర్ కంపెనీల కమీషన్ల కక్కుర్తికి ఆశపడి వృత్తిని నమ్ముకున్నవారికి అన్యాయం చేస్తున్నదని విరుచుకుపడ్డారు. నీరాను ప్రోత్సాహిస్తామని ఓట్ల కోసం గొప్పలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు నిర్వీర్యం చేస్తున్నారని నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజా యి నియంత్రణలో విఫలమైన ప్రభుత్వం ఆరోగ్యప్రదమైన కల్లుపై కత్తిగడుతున్నదని విమర్శించారు.

**చిత్తశుద్ధి ఉంటే కల్తీని అరికట్టండి..**

సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే కల్తీ కల్లు నిరోధానికి చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇందుకు బీఆర్ఎస్ సైతం సహకరిస్తుందని స్పష్టంచేశారు. అంతేగానీ గీత కార్మికుల కులవృత్తిని ఆగం చేస్తే చూస్తూ ఊరుకోబోమని తేల్చిచెప్పారు. ఇతర కులవృత్తిదారులను సమీకరించి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. 35 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కల్లు మండువాల నుంచి ప్రతినెలా రూ. 15 లక్షల చొప్పున ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపించారు. డిస్టిలరీలిచ్చే కమీషన్లకు ఆశపడి ప్రభుత్వ పెద్దలు సైతం ఇతర రాష్ట్రాల్లో నిషేధించిన బీర్లను తెలంగాణలో అమ్ముకునేందుకు అనుమతులు ఇచ్చేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో భువనగిరిలో ఏర్పాటుచేసిన నీరా కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తేసేందుకు కుటిల యత్నానికి దిగుతున్నదని ధ్వజమెత్తారు. అందాల తారలకు రుచి చూపించి నీరా గురించి గొప్పలు చెప్పుకున్న సర్కారు ఇప్పుడు నీరా కేఫ్‌ల ఏర్పాటుపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో కల్లు దుకాణాలను బంద్ చేస్తే చూస్తూ ఊరుకోబోమని శ్రీనివాస్‌గౌడ్ తేల్చిచెప్పారు. లక్షల మంది ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడి వేటాడుతామని హెచ్చరించారు. బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద ముడుపులు తీసుకుంటున్న ఎమ్మెల్యేల గుట్టు రట్టు చేస్తామని చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల తాటి, ఈత చెట్లు లేవని అబద్ధాలు చెప్పడం విడ్డూరమని అన్నారు. సర్కారుకు వృత్తిదారులపై ప్రేమ ఉంటే తాటి, ఈత చెట్లను నరికిన వారిపై కేసులు పెట్టాలని, విధ్వంసాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే లిక్కర్ మాఫియా, కల్లు కాంపౌండ్ల నుంచి కమీషన్లు తీసుకున్న ఎమ్మెల్యేలపై విచారణ జరిపి కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. గౌడన్నలకు మద్యం దుకాణాల కేటాయింపులో మరింత ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్తీ కల్లును అరికట్టకుండా కల్లు మండువాల జోలికి వస్తే సహించబోమని పల్లె రవికుమార్‌గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లు గీత కార్మికులను దొంగల్లా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. నీరా కేఫ్‌లను విస్తరించకుండా వృత్తిదారుల పొట్టగొడుతున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని కల్తీ కల్లు దందాను అరికట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ దశాబ్దాలుగా బీసీలను మోసం చేస్తూనే ఉన్నదని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 2013లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు అవకాశం ఇవ్వాలని, భవిష్యత్‌లో కోర్టు ఆదేశాలను నిక్కచ్చిగా పాటిస్తామని ఆ పార్టీ కోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌తోనే అడుగడుగునా అన్యాయం జరుగుతున్నదని ఆరోపించారు. అనివార్యంగా బీసీ కోటాను కుదించాల్సి వస్తున్నదని చెప్పారు. న్యాయపరమైన చిక్కుముడులు ఎదురవుతాయని తెలిసినా రేవంత్‌రెడ్డి 42 శాతం కోటా ఇస్తామని పచ్చి అబద్ధాలు చెప్పారని దుయ్యబట్టారు. అమలుపై చిత్తశుద్ధిలేకనే ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లలేదని ఆరోపించారు. ఇప్పుడు ఆర్డినెన్స్ పేరిట కొత్త నాటకానికి తెరలేపారని దుయ్యబట్టారు. ఇచ్చిన మాట తప్పిన, 42 శాతం కోటా ఇవ్వకుండా దగా చేసిన సీఎం.. బీసీలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



# రైతులకు నీళ్లు ఇవ్వాలి..

**పర్వతగిరి, వేద న్యూస్ :**

సాగునీరు ఇవ్వకపోతే రైతులతో పాదయాత్రగా వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. సోమవారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక, రైతు వ్యవతిరేక విధానాలతో అందరూ అవస్థలపాలవుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. రైతుల సాగు నీటి ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నీటి సమస్యే లేకుండా చేయాలని పాదయాత్ర చేస్తే దానిపై కొంతమంది చిల్లర మాటలు మాట్లాడారని విమర్శించారు. గతంలో గోదావరి నదిపై మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ సహా 11 ప్రాజెక్టులు కడుతుంటే వాటికి వ్యతిరేకంగా పోరాటం చేశానని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే రైతు భరోసా వేశారని విమర్శించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## అధికారిక కార్యక్రమంలో ఎట్టకేలకు కేటీఆర్ ఫొటో!

**వేద న్యూస్, సిరిసిల్ల రూరల్ :**

సిరిసిల్లలో ఎట్టకేలకు అధికార యంత్రాంగం, ప్రభుత్వం దిగొచ్చింది. బీఆర్ఎస్ నేతల ఒత్తిడి, ఆందోళనలకు అధికార యంత్రాంగంలో చలనం వచ్చింది. సిరిసిల్లలో సోమవారం నిర్వహించిన మైన రేషన్ కార్డుల పంపిణీలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ర్ ఫొటో ఏర్పాటు చేయడం గమనార్హం. సిరిసిల్ల నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌పై అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యహరిస్తున్న విషయం తెలిసిందే. కలెక్టర్ ప్రొటోకాల్ పాటించడం లేదని ఎస్పీకి బీఆర్ఎస్ సీనియర్ నేత, జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదుచేశారు. అనేకసార్లు అందోళనలు చేశారు. దీంతో సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేటలోని జిల్లా రైతు వేదికలో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఎమ్మెల్యే కేటీఆర్, కేంద్రమంత్రి, ఎంపీ బండి సంజయ్ ఫొటోలు ఏర్పాటు చేసి, ఎలాంటి పదవిలేని కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కార్యక్రమం నిర్వహించారు. రేషన్ కార్డులను సైతం ఆయన చేతుల మీదుగా పంపిణీ చేయించడం నియోజకవర్గంలో మరోసారి చర్చానీయాంశంగా మారింది.



# ఏటీసీల అభివృద్ధిని వేగవంతం చేయండి

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ రైజింగ్–2047కు అనుగుణంగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్స్(ఏటీసీ)ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సచివాలయం లో ఏటీసీల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు దశల్లో 11 ఏటీసీలను అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు వివరించారు. ఇప్పటికే రెండు దశల్లో 49ఏటీసీలు అందుబాటులోకి వచ్చినట్టు చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీ ఏర్పాటుచేయాలని, అందుకు అవసరమైన స్థల కేటాయింపు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. గిగ్ వర్కర్స్‌కు చట్టబద్ధమైన గుర్తింపు ఇచ్చేందుకు ప్రతిపాదించిన ప్రత్యేక పాలసీని అధికారులు సీఎంకు వివరించారు. ఈ పాలసీలో భా గంగా గిగ్‌వర్కర్లకు ప్రత్యేక సంక్షేమబో ర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రాతినిథ్యం వహించేలా ప్రతిపాదించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి!

**వేద న్యూస్, హైదరాబాద్ :**

స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని, నియోజకవర్గ స్థాయిలో ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సీనియర్ నేతలు పాల్గొనాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ చేస్తోన్న మోసాలతో పాటు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ అవినీతి, అప్రజాస్వామిక విధానాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో యూరియా, విత్తనాల కొరత తీవ్రంగా ఉన్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పాటు రైతుబంధు ఇవ్వకుండా అన్నదాతలకు చేస్తోన్న ద్రోహాన్ని కూడా ప్రజలకు వివరించాలన్నారు.రేవంత్ పాలనలో గ్రామాల్లో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యం గురించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలులో చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ పార్టీ వైఖరి గురించి ప్రజలకు విడమిర్చి చెప్పాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటాలు, నిరసన కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచ్చేసలా పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న "గిఫ్ట్ ఎ స్మైల్" కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన సుస్మిత అనే పేద విద్యార్థినికి ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డా.చంద్రశేఖర్, డా.ప్రణయవాణి దంపతులు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు కేటీఆర్ వారిని అభినందించారు.

# ప్రైవేట్ ఆక్రమణలను సహించేది లేదు

**వేద న్యూస్,అబిడ్స్, జులై 21 :**



రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లిలోని భాగ్యనగర్ ఎన్‌జీవోల స్థలాల్లో ప్రైవేట్ ఆక్రమణలను సహించేది లేదని, ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకొని భాగ్యనగర్ తెలంగాణ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ ఉద్యోగులకు స్థలాన్ని అప్పగించాలని బీటీఎన్జీవో హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణగౌడ్ డిమాండ్ చేశారు. గోపనపల్లిలో ఆక్రమణలను నిరసిస్తూ ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం ఆరో రోజుకు చేరాయి. ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యోగులు తరలివచ్చి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ.. బీటీఎన్జీవోకు చెందిన సుమారు 4 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు, సభ్యులకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, కోశాధికారి ఏ శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, రజియాబేగం, కేశ్యానాయక్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# 'బెట్టింగ్' సెలెబ్రిటీలకు ఈడీ నోటీసులు..!

**వేద న్యూస్, హైదరాబాద్ :**



బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన సినీ, టీవీ, సోషల్ మీడియా ప్రముఖులు, బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు సహా 29 మందిపై ఇటీవల ఎఫ్ఐఆ ర్ నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).. వారి విచారణకు రంగం సిద్ధం చేసింది. సోమవారం పలువురికి నోటీసులు ఇచ్చింది. ఈ నెల 23న దగ్గుబాటి రానా, 30న ప్రకాశ్ రాజ్, ఆగస్టు 6న విజయ్‌దేవరకొండ, 13న మంచు లక్ష్మిని విచారణకు రావాలని పిలిచింది. హీరోయిన్లు ప్రణీత, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, టీవీ యాంకర్లు శ్రీముఖి, రీతుచౌదరి, విష్ణుప్రియ, శ్యామల, ఇన్‌ఫ్లుయెన్సర్లు హర్షసాయి, భయ్యా సన్నీయాదవ్‌తోపాటు మరికొందరి పేర్లు కూడా ఈడీ ఎఫ్ఐఆర్‌లో ఉన్నాయి.కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. మియా పూర్‌కు చెందిన వ్యాపారవేత్త పీఎం ఫణీంద్రశర్మ బెట్టింగ్ యాప్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెలెబ్రిటీలు ప్రచారం చేయడం వల్ల బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో పడి చాలామంది నష్టపోతున్నారని పేర్కొన్నారు. తీవ్రంగా నష్టపోయిన చాలామంది యువకులు ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసి, దర్యాప్తు సాగిస్తున్నది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073